# అంబారీ సేవ

పోలవరపు కోటేశ్వరరావు



కరకరమని పొద్దు పొడిచిన దగ్గర నుండి ఒకటే ఎండ. ఇంత మండిపోయే ఎండా కాలం ఇంతకు ముందు వచ్చిన గుర్తే లేదు. ఐనా రైతులకు వ్యవసాయపు పనులు సజావుగా సాగిపోవటానికి కావలసిన ముందుపనులన్నీ ఇప్పుడే పూర్తి చేసుకోవాలి. చినుకు సాగిందంటే తీరిక వుండదు.

కందికంప పోగు పెట్టుకున్నారు. కంప తొడుగులు వీధివేక్క వదిలారు. పిడకల గుడిసె కందికంపతో కట్టి తడవకుండా కప్పెట్టారు. బళ్ళు కట్టి వూర చెరువులోనుండి మట్టి తోలుకు వచ్చి బరంతులు చేసుకుంటున్నారు. పొలంలో వున్న రైతులు చెమటలు కక్కుతున్నా కూడా ఆగకుండా పనులు పూర్తి చేస్తున్నారు.

చెరువు ఎండిపోయి నెర్రెలు విచ్చింది. నల్లరేగడి అచ్చులచ్చులుగా విడిపోయి వుంది.

భద్రయ్య పలుగుతీసుకుని నల్లమట్టి విరగదీస్తున్నాడు. తమ్ముళ్ళు పనిలో సహకరిస్తున్నారు.

'లక్ష్మయ్యా ఈ బండి సావిడి పక్క పల్లంలోంచ తోలేసి రా' అన్నాడు.

లక్ష్మయ్య బండి చక్రం మీద కాలేసి తొట్లో ఎక్కి చెరణాకోలతో ఎడ్లను అదిలించాడు. బండి కదలటంలేదు. వోట్టుపట్టిన చక్రాలను ముందుకు నెడుతూ తమ్ముళ్ళిద్దరూ సహకరించారు. బండి సాగింది. రెండో బండి నిండా పల్లికలతో మట్టి పోస్తున్నారు. సుందయ్య పార తీసుకుని కాళ్ళ సందును గట్టిగా పట్టుకన్న పల్లికలో మట్టినింపుతున్నాడు.

బండి నిండింది. సుబ్బడు తొట్లో కూర్చుని ' అహహాయ్! ఆసి నీ సిగ తరగ! చో చో!, అంటూ ఎలపట దాపట గిత్తలను అదిలిస్తున్నాడు. గిత్తలు హుషారుగా బండిని లాక్కుని పోతున్నాయి.

వీపుమీద దురద పెడుతుంటే సన్నని బెత్తంతో గోక్కుంటూ భద్రయ్య తమ్ముళ్ళవైపు చూచాడు.

ఎర్రగా సన్నగా వుండే సుందయ్య అందమైన వ్యక్తి. ఇరవై సంవత్సరాలు నిండబోతున్నాయి. కాయ కష్టం చేసిన శరీరం కండలు తిరిగి బలిష్టంగా కన్పిస్తోంది. చెమట ఆరి మెడ కింద వుప్పరికి తెల్లగా కన్పిస్తోంది. చెలాకీతనానికి సుందయ్య పెట్టింది పేరు.

'అన్నయ్యా' అన్నాడు సుందయ్య.

భద్రయ్య ఏమిటన్నట్టు చూశాడు.

ఏదో అడగాలనుకున్న సుందయ్య అడగలేకపోయాడు. 'మంచినీళ్ళు తాగుతావా?'

అందుకో!

సుందయ్య తాబేటికాయ తెచ్చి అన్నకిచ్చాడు.

కొయ్యముంత తీసి, ఎత్తి పట్టుకుని గటగట తాగుతూ, తమ్ముడి వంక చూచాడు. మధ్యలో ఆపి 'నువ్వు తాగుతావంటరా?' అని అడిగాడు.

'వద్దు'.

'నువ్వురా!' మూడో తమ్ముడు కృష్ణారావు నడిగాడు.

అందరిలో చిన్నవాడైన కృష్ణారావు అలిసిపోయి మట్టిలో చతికిలపడి కూర్చున్నాడు. కృష్ణారావు తాబేటికాయ అందుకుని తాను తాగాడు.

"లక్ష్మయ్య బండి యింకా రాలేదేమిట్రా?"

'అన్నయ్య ఈ పూట పని మానేద్దామన్నాడు.'

'పలుగూ పారా పల్లికలూ, గిత్తల బండి లో వేయండి. సుబ్బడిని కేకెయ్! బండాపమను' అన్నాడు భద్రయ్య.

సుందయ్య తలగుడ్డ వూడ దీసి భుజాన వేసుకున్నాడు. ముఖంమీద పట్టిన చెమట తుడుచుకుంటూ, 'అన్నయ్యా' అన్నాడు.

భద్రయ్య ఏమిటన్నట్లు చూశాడు..

సుందయ్యకు అడగాలని వుంది. కానీ, ఏమంటాడోననే భయం.

తమ్ముడు మాట్లాడ కుండా వుండే సరికి భద్రయ్య విసుగ్గా అన్నాడు: 'చెప్పరా? ఆ నసుగుడెందుకు?'

అన్న మాటతో సుందయ్యకు భయమూ కలిగింది. ధైర్యమూ వచ్చింది. 'ఏమీ లేదన్నయ్యా'

'ఊ!'

'రాత్రి ......'

'ఏమైంది?'

'రాత్రి పోలీసులు సూరపనేని శ్రీరాముల్ని కొట్టారంట.'

అన్నకు ఏది చెప్ప వద్దనుకున్నాడో అదే చెప్పాడు. ఇలా చెప్పినందుకు తనలో తాను నాలుగు తిట్టుకుని అన్న వెంట అడుగులో అడుగు వేస్తూ నడుస్తున్నాడు.

భద్రయ్య మౌనంగా నడుస్తున్నాడు. దూరంగా తాళ్ళతోపుమీదుగా శ్రీకాకుళం కన్పిస్తోంది. గాలిగోపురం ఎత్తుగా నిలిచి వుంది.

'దొరగారిని ఎదిరిస్తే వూరుకుంటారా?' అన్నాడు.

సుందయ్య నసుగుతూ ఈ రోజు అంబారీ సేవ అన్నాడు. "ఔను, ఈ రోజన్నా వెళ్ళి దొరగారి దర్శనం చేసుకురావాలి" భద్రయ్య నెమ్మదిగా చెప్పాడు.

'మామయ్య వెళ్ళటం లేదా?'

'ఆయనకు ఒంట్లో బాగుండలేదు.'

'ఎవరెళ్ళి చూస్తారు?'

'నేనే వెళ్ళాలిరా.' భద్రయ్య గుడిముందు రావి చెట్టు నీడలో నిలబడి తమ్ముడితో అన్నాడు. 'ఇదేమో మన ఆనవాయితీ అయింది. ఈ మూడు రోజుల పండుగలో ఏదో ఒక రోజు వారి దర్శనం చేసుకుని నమస్కారాలు చెప్పకురావాలి'.

'నువ్వెక్కడికే వెళ్తావా?'

'వూళ్ళో పెద్దలు కూడా వస్తారు. నిన్ననే కరణం రామేశ్వరరావుకు కబురుపెట్టాము. ఆయన ఈ సాయంకాలం రమ్మన్నాడు.'

'అన్నయ్యా!'

'ఏం కావాలిరా? ఇందాకటి నుంచి నస పెడుతున్నావు'

నేనూ వస్తానన్నయ్యా...? సుందయ్య భయం భయం గా చెప్పాడు. భద్రయ్య ఒక మాటు తమ్ముని వంక చూచాడు. కోటేరు వంటి ముక్కు. నాగు మీసం కిందుగా ఎర్రని పలుచని పెదాలు. వయసులో కళకళలాడుతూ సౌష్టవంగా వున్న శరీరం. ఆశతో తన వంక చూస్తున్న అందమైన కళ్ళు.

"వీడు అచ్చుగా మా నాయన మాదిరిగానే వుంటాడు"అనుకున్నాడు.

"నే వస్తానన్నయ్యా?"సుందయ్య మళ్ళీ అడిగాడు.

రాత్రే అక్కడ గొడవయింది. ఈ రోజెట్లా వుంటుందో? భద్రయ్య ఔనూ కాదూ అనకుండా చెప్పాడు.

'నేను జనంలోకి వెళ్ళనులే అన్నయ్యా! నీ వెంటే వుంటాను.'

'తీసుకు వెళ్తా కానీ ఈ మాట ఎవరితోనూ అనబోకు!

సుందయ్యకి గుండె నిండా ఆనందమయింది.

'నువ్వూ అన్నయ్యా కావిళ్ళేసుకుని నీళ్ళు తెచ్చి అన్నిటిలో నింపేయండి. అమ్మతోనూ వీరయ్య మామతోనూ చెప్పకు. నువ్వసలే భోలా శంకరుడివి?

సుందయ్యకు నోటమాట పెగిలే స్థితిలో లేదు. తల వూపి వూరుకున్నాడు.

ఉమ్మడి కుటుంబాలు విడిపోకుండా ఎవరో ఒకరి పెత్తనం కింద వుండే రోజులు కావటం వలన, పని విభజన జరిగి సంసారాలు దొర్లుతున్నాయి. మెట్టపైరుంటే ఆరుకాలాలపాటూ ఏదో పని తగులుతుంది. ఆడా మగా అనకుండా అంతా కష్టపడకపోతే, పళ్ళెంలోకి గంజి నీళ్ళుకూడా దొరకవు.

సాయంకాలానికి చల్లబడింది. చుక్కలు పొడిచి మెరుస్తున్నాయి.



పైరుగాలికి ప్రాణాలు లేచి వచ్చినట్టుగా వుంది.

ఇంటిముందు ఊడ్చి నీళ్ళు జల్లారు. మంచాలు వేశారు. లక్ష్మయ్య సుందయ్య వంతేసుకుని కావిడి వేసుకుని నీళ్ళు మోస్తున్నారు. ఆ వూరంతటికీ ఊరు మధ్య బావి ఒక్కటే తాగేందుకు ఆధారం.

బిందెలు, గాబులూ, తొట్లూ, బానలూ నిండిపోయాయి. కృష్ణారావు గేదెలను కడిగి ఆరుబయట దిబ్బమీద కట్టేశాడు. సుందయ్య పాలు తీసి పాల చెంబు తల్లి కిచ్చాడు. దూడావును జాగర్తగా సమంగా వున్న చోట పలుగుపాతి పలుపుతాడు పొడుగ్గా వుండేటట్టు కట్టేశాడు.

మాచెమ్మ పిడకల కుంపటి మీద పాలకుండ వుంచింది. మూత ఓరగా వేసి పక్కనున్న పొయ్యి వూదుతూ కూర్చుంది. సుందయ్య తల్లి దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు.

ఆమె వూదుతున్న గొట్టం పక్కన వేసి పొగతో మండుతున్న కళ్ళను పమిట చెంగుతో తుడుచుకుంది.

'పొయ్యి సరిగా రాజుకోలేదు'అంది.

'నేనూదనా అమ్మా.?'

'వద్దులే.'

'నేనూదుతాలేవే! ----'

'వద్దు. మామయ్య స్నానం చేస్తాడేమో కనుక్కో!'

నువ్వే కనుక్కో. సుందయ్య అన్నాడు. మేనమామంటే అందుకే భయం తల్లి నవ్వింది. తెల్లబడిపోయిన వెంట్రుకలు వెనక్కు నెట్టుకుని ముడివేసుకుంది. పీట మీద కూర్చొని సుందయ్య వంక చూస్తూ పొయ్యిలో పుల్లలు సవరిస్తోంది.

అమ్మా!

మాచెమ్మ కొడుకు వంక చూచింది. 'ఈ బిడ్డ అచ్చంగా పోయిన మారాజు మాదిరిగా వుంటాడు ముమ్మూర్తులా ఆయనే!' అనుకుంది.

సుందయ్య వుట్టి మీదున్న బుట్టలోనుండి మొక్కజొన్న బూరె తెచ్చుకుంటున్నాడు. ఆమె ఆలోచిస్తూ కూర్చుంది.

పెద్దాడు అచ్చం మేనమామ పోలికలతో పుట్టాడు.

రెండో వాడికి మేనమామ కోపంతో పాటు బాబు మంచితనం వచ్చింది. నాలుగో వాడికంతా స్వార్థం! అనుకుంది.

'అమ్మా!'

'చెప్పరాదురా సుందయ్యా! ఏం కావాలి?'

నేను అన్నయ్య వెంట అంబారీ సేవ చూడటానికి వెళ్తున్నా. ఆమె ఆశ్చర్య పోయింది. భయపడినట్లు ఆమె ముఖమే చెపుతోంది.

'అన్నయ్య వప్పుకున్నాడు.'

'వాడు పెత్తందారు. వెళితే వెళ్ళాడు, నీవు వద్దులే.'

'నాకు భయం లేదులే అమ్మా!'

'ఏటా మూడురోజులూ వెళ్తానే వున్నారు గదరా. ఈ ఏడేగా వద్దనేది.'

'అన్నయ్య రమ్మన్నాడు.' సుందయ్య నెమ్మదిగానే చెప్పాడు.

'ఏమిరా! వాడిష్టం. నీ ఇష్టం.'

'ఈ మాట ఎవరికీ చెప్పొద్దన్నాడు.'

ఆమె పాల చెంబు తొలుపుకు రాను బయటికి వెళ్ళింది.

సుందయ్య తల్లి వచ్చే వరకు అక్కడే నిలబడ్డాడు.

'ఒక పూటన్నా బిడ్డలకు వరన్నం పెడదామంటే బియ్యం చాలేట్లు లేవు. మొక్క జొన్నలు వండాల్సిందే.' ఆమె అనుకుంటూ ఇంట్లోకి వచ్చింది.

'మామయ్యకు తెల్లన్నం వండి పెట్టమ్మా. మాకు జొన్నలన్నమైనా పరవాలేదు. కానీ బుడం బియ్యం మాత్రం వండకు. చేతినిండా పొడుంటే యీ అన్నాలు తినొచ్చు. అదీ చాలా లేదామె!

'ఆవు ఈనుతుందిలే!'



Supraja SI-1-89

ఆమె మాట్లాడకుండా తుమ్మ కంప పొయిలో పెడుతూ కూర్చుంది.

'నే వెళ్తున్నానమ్మా!'

'నీ ఇష్టం.'

సుందయ్య వెళ్ళలేదు. తల్లి తలెత్తి చూచింది.

'ఏమిట్రా సుందయ్యా? చిన్నపిల్లాడిలా మారాం చేస్తావు!' అన్నది.

సుందయ్య నవ్వుతూ, 'మా అమ్మ మంచిది, మా అమ్మ మంచిది' అన్నాడు.

భద్రయ్య భార్య సరస్వతమ్మ వచ్చింది. తల్లీ కొడుకుల సంభాషణ విని తలుపు చాటున నిలబడింది.

అక్కడ తిరణాల గదా! చాలా బాలా అంగళ్ళుంటాయి. అంది.

తల్లికి తాను చెప్పదలిచింది అర్థమైంది. సుందయ్య బయటకు వెళ్ళాడు. వెనుకకు సరస్వతమ్మ వచ్చింది.

'అబ్బాయ్!' ఆమె పిలిచింది.

'ఏమిటొదినా?'

'నెమ్మదిగా మాట్లాడు!'

'చెప్పూ.'

'ఈ రూపాయి తీసుకువెళ్ళి వచ్చేటప్పుడు కారపు సరుకేదన్నా తెచ్చిపెట్టు.

'అలాగే లే వదినా!'

'మీ అక్క జయమ్మ చూస్తుంది.'

'ఎవరికీ తెలియనీయనులే వదినా!'

సుందయ్య రూపాయి బొడ్డున దోపుకుని వెళ్ళిపోయాడు.

శ్రీకాకుళం దేవాలయం పక్కనే చల్లపల్లి రాజా వారి బంగళా వుంది. ఆ విశాలమైన లోగిలిలో చాలా హడావుడిగా వుంది. పోలీసుల బందోబస్తు జాస్తిగా వుంది. ఇలా ఇంతకు ముందు ఏనాడూ జరగలేదు.

రాజా వారు దర్బారు తీర్చారు. వారి విశాలాలైన నేత్రాలనిండా ఠీవి కన్పిస్తోంది. చక్కని మీసకట్టు. తలమీద పాగా చాలా అందంగా వుంది. కలికి తురాయి కిందుగా వజ్రాలు మెరుస్తున్నాయి.

మెడలో ముత్యాల హారాలు, రతనాల పతకాలు వున్నాయి. పెట్రోమాక్సు లైట్ల కాంతిలో వారు ధరించిన బట్టలు రాజసానికి తగినట్లుగా వున్నాయి.

ఆయన రాజఠీవితో ఆశీనులైనారు.

ద్వార పాలకులు పిలుస్తుండగా పెద్దలు లోనికి వెళ్ళి వినయ విధేయతలు వుట్టిపడేలా నమస్కరించి గోడ వారగా నిలబడతున్నారు. శ్రీకాకుళ గ్రామానికున్న పెద్ద కరణం ఒక్కొక్కరినీ పరిచయం చేస్తున్నాడు. ప్రక్కనే నిలబడిన దివాన్ రైతు పెద్దలు చెప్పే విషయాలు వింటూ "దొరగారు విన్నారు. త్వరలో పరిష్కరిస్తారు" అని వారిని పంపించి వేస్తున్నారు.

భద్రయ్య శుభ్రంగా వుతికిన చలువ పంచెకట్టుకున్నాడు. భుజాలమీదుగా పై పంచె వ్రేలాడవేసుకున్నాడు. తలగుడ్డ చుట్టి పంగనామాలు పెట్టుకున్నాడు. వాకిటిలో చెప్పలు వదిలి కొట్టుకుంటున్న గుండెలతో లోనికి వెళ్లాడు.

భద్రయ్యను పిలిచారు. రాజావారున్న గదిలో అడుగు పెట్టాడు. నమస్కరించి గోడవారగా నిలబడ్డాడు.

కరణం రామేశ్వరరావు భద్రయ్య వంక చూచాడు. భద్రయ్య భయపడుతూ బిగుసుకుపోయి నిలబడ్డాడు. నమస్కరిస్తున్న చేతులు అలాగే వుండిపోయాయి. శరీరమంతా ముచ్చెమటలు పోస్తున్నాయి. భద్రయ్య పరిస్థితి గమనించి కరణం కొంటె నవ్వు నవ్వుకున్నాడు.

ఆయన దివాన్ వంకా, రాజావంకా చూచి"యీయన పోలవరపు భద్రయ్యండి, వీరి మేనమామలు నలుగురూ మన యెస్టేటులో మంచి పేరున్న రైతులండి. ఎప్పుడూ తమ సేవలో వుంటారండి. వీరి పెదమేనమామ కొల్లి వెంకయ్య మంచి వ్యవహర్తండి, తమ తండ్రిగారు ప్రత్యేకంగా కబురు

పంపించి, దర్బారుకు పిలిపించి గౌరవించారండి. వారు పోయిన తరువాత భద్రయ్యకు కబురు పంపించామండి' అన్నాడు. మాటలో అమితమైన వినయాన్ని ప్రకటించి, కరణం రామేశ్వరరావు రాజావారి వంకా, దివాన్ వంకా చూస్తూ నిలుచున్నాడు. రాజాగారిలో చలనం వచ్చింది. ఆయన కళ్లు తిప్పి ఠీవిగా చూస్తూ కుడి చేత్తో మీసపు కొస సవరించుకున్నారు. అలా ఎందుకు చేశారో కరణానికి అర్థం కాలేదు. దివాన్‌కు అర్థమయినా మాట్లాడలేదు.

మీరు వెళ్ళచ్చు - కరణం అనబోయి దివాన్ వంక చూచి ఆగిపోయాడు.

దివాన్ సౌమ్యంగా ఏవైనా చెప్పుకోవలసినవి వున్నాయా అని అడిగాడు. అసలే కంగారుగా వున్న భద్రయ్య ఏమీ లేవన్నట్లు తలవూపాడు.

దివాన్ బుర్రలో తళుక్కున ఆలోచన మెరసింది.

'భద్రయ్యా!' దివాన్ అన్నాడు.

భద్రయ్య మరింత వినయంగా 'చిత్తం' అన్నాడు.

'మీ పూర్వీకులనుండి దివాణానికి నమ్మకంగా సేవలు చేస్తున్నారు. రాజావారికి మీ యందు మంచి అభిప్రాయం వుంది. గ్రామాలలో అశాంతిలేకుండా చూసుకోండి.'

'చిత్తం'

'మీరు వెళ్లిరండి.'

భద్రయ్యకు బోనులో నుండి బయట పడినట్టుగా వుంది. పై పంచతో చెమటలు తుడుచుకుని, బజారులోకి వచ్చాడు. ఐనా అతనికి దడ ఆగలేదు. అది భయం వలన వచ్చిందో భక్తి వలన కలిగిందో తెలియటంలేదు.

తన మేనమామ యింటి దగ్గర బయలు దేరి గుడివాడ సీమలోని చాటపల్లిలో వున్న తన చెల్లెల్ని చూడటానికి వెళ్లేవాడు. దారి పొడవునా గ్రామాలలోని తగాదాలు తీరుస్తూ బంధువుల యింట ఆగుతూ చాటపల్లి వెళ్ళేసరికి పదిహేను రోజులు పట్టేది. తిరుగు ముఖంలో కూడా యిదే వరుస వుండేది. దాయాదుల తగాదాలలో, గ్రామకక్షల్లో, వచ్చే విభేదాలలో నిష్పక్షపాతంగా తీర్పు చెపుతూ అందరికీ సఖ్యత కూర్చేవాడు అందుకే కొల్లి వెంకయ్యను ధర్మమూర్తి వెంకయ్య అనేవారు.

తన యెస్టేటులో ప్రతిభాశాలి వుండటం తన కీర్తి ప్రతిష్ఠలకు మరింత వన్నెతెస్తోందని, యీరైతు పెద్దను స్వయంగా పిలుపించుకుని ప్రస్తుతం వున్న రాజావారి తండ్రి సత్కరించి పంపించారు. అప్పటి నుండి యీకుటుంబం వారికి చల్లపల్లి కోటలో సన్నసువారంలో మర్యాదలు జరిగేవి.

ఇదంతా భద్రయ్యకు తెలుసు. అందువల్ల మేనమామను తలచుకుని మనసులో నమస్కరించుకున్నాడు. దూరంగా ప్రహరీ గోడ వద్ద నిలబడి సుందయ్య దేవాలయం ముందు జరిగేది చూస్తున్నాడు. చెరువు ప్రక్కన వరుసగా అందమైన గుర్రాలను కట్టివేశారు. లొట్టి పిట్టలు నిలబడి వున్నాయి. వాటి వీపు మీద రెండేసి నగారాలు కట్టారు. దేవాలయానికి ఎదురుగా వున్న యేనుగును ఏటిలో స్నానం చేయించి, ముఖాన పెద్ద పంగనామాలు పెట్టారు. మందపాటి జంపఖానా దాని వీపు పైన వేశారు. వీపుమీద అందమైన మందిరాన్ని నిలిపి, తాళ్ళతో బంధించారు. అదే స్వామి వారు రాజ్యలక్ష్మి, భోగలక్ష్మి సమేతంగా కూర్చుని వూరేగే మంటపం.

దేవాలయ పరిసరాలు పోలీసులతో నిండివుంది. ఎక్కడ చూచినా లాఠీలు చేత్తో పట్టుకుని తిరుగుతున్నారు. అన్నదమ్ములిద్దరూ దేవాలయంలోకి వెళ్లి దర్శనం చేసుకున్నారు. నొసట కుంకుమ పెట్టుకుని, రథం దగ్గరకు వచ్చారు. విగ్రహాలను పైకి చేర్చి జాగర్తగా కట్టటం కాగా పూజారులు ఆ మందిరంలో కూర్చున్నారు.

ఏనుగును మోకాళ్లపై వంచి మావటీడు రాజావారు పైకి ఎక్కి కూర్చునేందుకు వీలు కలిగించాడు.

రథోత్సవం ప్రారంభమయింది.

సన్నాయివాయిద్యాలు కృతినాలపిస్తున్నాయి.

బాకాలు విజయ ధ్వనులు తెలుపుతున్నాయి.

తూర్యనాదాలు మిన్నుముట్టాయి.

నవోత్కానాలు చెవులు చిల్లులు చేస్తున్నాయి.

బేండువారు ఠీవిగా వాయిస్తున్నారు.

గుర్రాలపై రౌతులు దర్పాలు చూపుతున్నారు.

తెల్లగా, నల్లగా, ఎర్రగా వున్న గుర్రాలను బాగా అలంకరించి, రెండు వరుసలలో నడపటం అందంగా వుంది.

అలంకరించిన ఒంటెలు వికారంగా వున్నాయి.

బేడే పైపర్సు నాజూగ్గా నడుస్తున్నారు.

పెట్రోమాక్సు లైట్లు, కాగడాలు చాలినంత వెలుగును యివ్వలేకపోతున్నాయి.

అప్పుడే ఉదయిస్తున్న చందమామ యింకా పైకి రాలేదు. ఎందుకో పొంచి చూస్తున్నాడు.

దేవదాసీలు నృత్యాలు చేస్తున్నారు.

పోలీసు బందోబస్తు బహుకట్టుదిట్టంగా వుంది.

దూరంగా బాణాసంచా ఆకాశవులోతుల్లోకి వెళ్తోంది.

వూరేగింపు నెమ్మదిగా కదులుతోంది. వేదఘోషతో ద్విజులు ముందునడుస్తున్నారు.

నల్లమందుమత్తుతో చెవులాడిస్తూ ఏనుగు కదులుతోంది. చుట్టుప్రక్కల గ్రామాల నుండి వచ్చిన జనం ఆనందంగా చూస్తున్నారు.

తమ్ముడి ప్రక్కన నిలబడిన భద్రయ్య, తాము ఎస్టేటులో ప్రత్యేక గౌరవం పొందుతున్నందుకు తృప్తిగా వున్నారు. అన్నయ్యా! దొరగారు బలే బాగున్నారు! సుందయ్య అన్నాడు. యీయేడు ఉత్సవం చెడిపోతుందేమోననుకున్నా. బాగా జరుగుతోంది.

'మనం వెళ్లి మిఠాయి కొనుక్కుందామే!' అన్నాడు సుందయ్య డబ్బుల్ని తమదుకుని, అన్నవంక చూచాడు. ఇద్దరూ బయలు దేరారు.

యింతలో ఊరేగింపు ఎదురుగా నినాదాలు విన్పించాయి. వెంటనే ప్రక్కల నుండి కూడా ప్రారంభమైనాయి.

మహాత్మా గాంధీ! జిందాబాద్

కాంగ్రెస్ పార్టీ! జిందాబాద్

బోలో స్వతంత్ర్య భారత్‌కు - జిందాబాద్ జై.

ఎటు చూచినా నినాదాలే.

దేవాలయ గోపురం బిగ్గరగా నినదిస్తున్నట్టుంది.

పోలీసుల పరుగులు విజిల్సు, బూట్ల మోతలు, లాఠీల పకపకలు, అమ్మో, అయ్యో అనే కేకలు, ఆ నినాదాలతో కలిసిపోయాయి.

ఊరేగింపు చెడిపోయింది.

గుర్రపు రౌతులు ఏనుగు చుట్టూ వలయంగా నిలబడ్డారు. ఈ సంస్థానంలోని సిపాయిలూ బర్సీలతో మరో వలయంగా నిలచారు. ఆపైన పోలీసుల వలయంగా కట్టుదిట్టంగా వుంది. ఊరేగింపు ముందుకు సాగలేదు.

అదనపు పోలీసు బలగం లాఠీ ఛార్జీ మొదలెట్టారు. గాలిలోకి తుపాకులు పేలాయి. జనం కాలికుందుకే పారిపోయారు.


నవభారత్ బుక్ హౌస్
ఏలూరురోడ్ ◆ విజయవాడ 520002 ◆ ph: 77578
వారు సమర్పిస్తున్న శీర్షిక 'పజిల్...పజిల్'
పుట్టగుంట గోపీచంద్
నిర్వహిస్తున్న ఈ శీర్షిక అతి త్వరలో ప్రారంభం

వచ్చిపడే జనాన్ని తట్టుకోలేక అన్నదమ్ములు విడిపోయారు. పరుగెత్త-బోయి భద్రయ్య పడిపోయాడు. జనం తొక్కుకుంటూ వెళ్లారు.

అతికష్టంమీద లేచి, జారి పోయే గోచీని బిగదీసుకుని కుంటూకుంటూ వెళ్తున్న అన్నదగ్గరకు సుందయ్య వచ్చాడు.

పోలీసులు పరుగెత్తుకొచ్చారు. భద్రయ్య పైకి లాఠీ, లేపి విసిరారు.

అన్నతలకు తన శరీరాన్ని అడ్డుపెట్టి సుందయ్య నిలిచాడు. ఆ దెబ్బ అతని వీపు మీద పడింది.

దెబ్బవెంట దెబ్బ పడుతోంది. పారిపోదామనుకునే లోపు, తల పై తగి-లిన దెబ్బకు భద్రయ్య పడిపోయాడు. అన్నను కాపాడు కోవాలని, తన శరీరంతో అన్నను కప్పివేశాడు సుందయ్య లాఠీ దెబ్బలెన్ని తగిలాయో తెలి-యదు. వళ్ళంతా రక్తపు గూడయింది. పై పంచలు, కట్టు పంచెలు ఎర్రబడినాయి. ఐనా లాఠీలు ఆగలేదు.

ఇంతలో వెనుక నుండి "ఆపండి" అని ఎవరో అరిచారు. ఆ వచ్చిన వ్యక్తి అన్నదమ్ములిద్దరినీ చూచాడు. గుర్తుపట్టాడు.

'ఇందాక రాజావారి దర్శనం చేసుకుంది నీవేగా?'

'ఇతనెవరు?'

తమ్ముడు.

'వీళ్లకు కట్టుకట్టండి. మంచినీళ్లు యివ్వండి.' యిద్దరు పోలీసులు ఆ పనిమీద వెళ్లారు. మిగతా వాళ్లు శిత్రాటే చేసి, మళ్లీ చావబాదే పనిమీద జనం వైపు నడిచారు.

'భద్రయ్యా! నన్ను గుర్తుపట్టలేదా?'

గుర్తురావటం లేదు.

'నేను రామాస్వామిని పెనుమత్స.'

భద్రయ్యకు ప్రాణం వచ్చింది. లేవబోయాడు. కాని కాళ్లు సహకరించలేదు. తమ్ముడి వంక చూచాడు. సుందయ్య ప్రక్కనే నేల మీద పడివున్నాడు.

రామాస్వామి చేయి అందిరచి యిద్దరినీ లేపాడు. అన్నదమ్ములిద్దరూ ఒక-రినొకరు ఆసరా చేసుకుని నిలబడ్డారు.

'మీరెందుకొచ్చారు?' రామాస్వామి అడిగాడు.

'రాజావారిని చూద్దామని.'

'చూచారుగా! కాలం మారిపోతోంది. మనం ఎక్కడున్నామో ఏం చేస్తు-న్నామో ఆలోచించుకోవాలి.'

అన్నదమ్ములిద్దరూ నోరు తెరిచి వింటున్నారు.

'మీ మేనమామ ఎస్టేటుకు ఊడిగం చేశాడు. కుక్కకు మెతుకులు వేసి-నట్టు సన్నసువారం లో అందించారు. అదే గొప్పని యీరోజు తమ్ముడిని తీసుకుని నీవు వచ్చావే.'

రామాస్వామి నెమ్మదిగా, స్పష్టంగా తిడుతున్నాడు.

భద్రయ్యకు అర్థం కాలేదు.

'యీదేశానికి మంచి రోజులు రాబోతున్నాయి. యీ రోజు మీ అందరి మీద పడిన దెబ్బలు మన దేశానికి వేసిన సంకెళ్ళను పగల గొట్టేందుకు సిద్ధం కండని చెపుతున్నాయి.'

చెప్పేది వింటూ యిద్దరూ పై పంచతో తల బిగించి కట్టుకు-న్నారు. పంచ బిగదీసి, కుచ్చెళ్లు పైకి దోపుకున్నారు.

అతను చెప్పాడు. నేను చెప్పేది మీకు అర్థం కాదు. క్రమేణా తెలుస్తుంది. యీ దేవాలయం ముందు ప్రారంభమయిన యీ ఉద్యమం ఆగదు, ఆగ-టానికి వీలులేదు.

'నీవేం చేస్తున్నావు?' జడుస్తూ భద్రయ్య అడిగాడు.

ఎస్టేటులో ఉద్యోగం.

'ఏం ఉద్యోగమన్నా?'

'డ్రయివరు ఉద్యోగం, అటుచూడు, ఆ పోలీసు ఆఫీసరు వాడో భయం-కరమైన కిరాతుడు. వాడి పేరు వెంకటేశ్వరావు వాడి కారు తోలేందుకు నన్ను పంపించారు.'

'అన్నా నీ సాయం మరిచిపోము.'

'వెళ్లండి. నెమ్మదిగా వెళ్లండి.'

అన్నదమ్ములు బయలు దేరారు. కోమట్ల బజారులోవకి వచ్చి ఒక అరుగు మీద కూల బడ్డారు.

సుందయ్య రొంటిని తడుముకున్నాడు. అమ్మయిచ్చిన డబ్బులు జారిపో-యాయి. వదిన యిచ్చిన రూపాయి కూడా పోయింది. అతను అనుకు-న్నాడు. యీ తిరణాలలో ఏం చూచినట్టు? ఏం కొన్నట్టు?

దెబ్బలు, రాజామర్యాదగా దెబ్బలు అన్నతో పాటు తనకూ దొరికాయి. మంచి సంభావనే జరిగింది.

అన్నయ్యా?

ఏమిటి?

మనవాళ్ల బండి వస్తోంది. దాన్లో వెళ్దాం.

ఇద్దరూ జల్లలో కూర్చోలేక గడ్డి మీద పడుకున్నారు.

యిద్దరి మనసులో ఒకే ఆలోచన.

మహాత్మాగాంధీ కి జై అని ఎందుకు అరిచారు?

కాంగ్రెస్ పార్టీకి జిందాబాదని ఎందుకన్నారు?

రాజాగారికన్నా గాంధీగారు పెద్దవారా?

(ఈ కథకు సంబంధించిన వాతావరణం 1929 ప్రాంతానిది. దివితా-లూకా ప్రకాశంలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా రూపొందించబ-డింది.) ●

## మనమూ వున్నాం




స్పెయిన్ దేశపు రాజు ఆల్‌ఫోన్సో గొప్ప ధైర్యశాలి, యుక్తిపరుడు అవటం చేత తన దేశాన్ని మహమ్మదీయుల దండయాత్రలనుండి రక్షించుకోగలి గాడు. కానీ దురదృష్టవశాత్తు తన కొడుకు తన శత్రువుల చేతికి చిక్కాడు.

మహమ్మదీయ సుల్తాన్ నగరాన్ని ఆక్రమించుకుని, దాని నిండా బాగా కనపడేటట్టు ఉరికంబాలని ఏర్పాటు చేశాడు. రాజకుమారుడ్ని ఉరికంబం ఎక్కటానికి సిద్ధం కమ్మన్నాడు. అదే సమయంలో స్పెయిన్ రాజుకి ఇల్లా సందేశం పంపించాడు.

"ఆల్ ఫోన్సో, నీకు నీ నగర ప్రజలు కావాలో, నీ కొడుకు కావాలో తేల్చుకో"

రాజు సభ తీర్చాడు. అందరూ ఆయన నిర్ణయం కోసం ఆయన మొహాన్ని పరిశీలిస్తున్నారు. తన ప్రజలను వదులుకుంటాడా, లేక తన కొడుకుని వదులుకుంటాడా అని ఆతృతగా ఎదురు చూసారు సభలోని వారు. కానీ ఆల్‌ఫోన్సో తన నిర్ణయంలో ఎక్కువ సమయం తీసుకో లేదు. "ఒక్క ప్రాణం కోసం అన్ని ప్రాణాలు బలి ఇవ్వను. నా ప్రజల కోసం నా కుమారుడ్ని వదులుకోటానికి సిద్ధంగా వున్నాను" అని సుల్తాన్‌కి జవాబు అంటే 'దేశమంటే కొడుకు కాదోయ్ దేశమంటే మనుషులోయ్' అని చెప్పాడన్నమాట. —యస్.